‘వారెందుకుగానీ, నేనే మా ఇంటిగురించి చెబుతాలెండి...’ అన్నా. శుభగారిని అమ్మగారనటం నచ్చదు. మేడమ్ అంటే ఫరవాలేదు గానీ నాకెందుకనో ఆ పిలుపు ఇంకా అలవాటు కాలేదు. నవ్య ‘అక్క’ అని పిలుస్తూంటే మాత్రం తన వయసు తగ్గినట్లుగా అనిపిస్తుందనుకుంటా, చాలా సంతోషపడుతూంటారు!

‘మీ అక్కయ్యగారికి సరిగా చెప్పటం రాదనిపించి, మా ఇంటి గురించి నేనే చెబుతానంటున్నాను. నాకైతే... మా ఇల్లంత అందమైనది ఈ ఊరు మొత్తంమీద ఇప్పటికీ కనపించలేదు! నిజమండీ...!

ధగధగలాడే దీపాలు, ఖరీదైన ఫర్నీచరూ ఏవీ లేకుండానే మా ఇల్లు, ఆ పరిసరాలూ ఎంత హాయిగా అనిపించేవో...! చెబితే, వినేవాళ్ళకు అర్థంకాకపోవచ్చునుగానీ, అనుభవించిన వాళ్ళకే తెలుస్తుంది మరి...!

ఇప్పటికీ, ఎప్పుడు మా ఊరు వెళ్ళినా, మా ఇంటి ముందు నిలబడగానే ఎంత ఆనందంగా ఉంటుందో...! ఇంటి మెట్లు ఎక్కుతుంటేనే... అబ్బో... ఎంత పరవశమో...!

పైకి ఇల్లు చాలా సామాన్యంగానే ఉంటుంది చూడటానికి. రెండు చిన్న స్థంభాలతో ఇంటికి చిన్న వరండా, మామూలు బండరాళ్ళ గచ్చూ ఉన్న పెంకుటిల్లు.

చిన్నతనంలో రాత్రిపూట నాన్నమ్మా, నేను వెనక పెరట్లో మంచాలేసుకుని పడుకునే వాళ్ళమా, పూర్తిగా తెల్లారకుండానే, నాన్నమ్మ చీపురుతో ఊడ్చే బరబరలూ, ఆవుల, గేదెల 'అంబా'ల అరుపులూ... గొప్ప సంగీతం వింటున్నట్లేననుకోండి! ఇక ఇంటిలోపలకు వచ్చి మరి కాసేపు బద్ధకంగా పడుకుంటే... గాజుల గలగలతో అమ్మ వెన్న చిలుకుళ్ళూ, కూనిరాగాలూ...! అలాంటి ఉదయాలు ఎంత బావుండేవో...

ఇల్లంటే... ఖరీదైన ఏడంతస్తుల మేడ మాత్రమే కాదండీ... తీయని అనుభూతుల నెలవుగా ఉండే ఇల్లు ఎలాంటిదైనా, ఎంత చిన్నదైనా... చాలా అందంగా అనిపిస్తుందండి..!' మనస్ఫూర్తిగానే ఆ మాటల్ని చెప్పాను.

మనకు నచ్చిన వ్యక్తులూ, నచ్చని వాళ్ళూ కూడా కొన్ని విషయాలను నేర్పించగల రనుకుంటా!

అప్పుడు చికాకు కలిగించినవే, ఇపుడు తలుచుకుంటూంటే, నిజంగానే విలువైన తీపి జ్ఞాపకాలుగా అనిపిస్తున్నాయి....!

నరసింహంగారి దగ్గర్నుండి నేనెన్ని విలువైన విషయాల్ని నేర్చుకోగలిగాననుకుంటానో, అలాగే శుభ గారి దగ్గర్నుండీ నేర్చుకున్నానని చెప్పగలను! వాటిలో ముఖ్యమైనది... ఎవరిన్కైనా సరే, చిన్నబుచ్చుతూ, నొచ్చుకునేట్లుగా మాట్లాడటం మంచి పద్ధతి కానేకాదని! అప్పటివరకూ ఉల్లాసం కలిగించిన ఆ ఇంటి పరిసరాలు... ఆ రోజునుండీ కృత్రిమంగా తోచి నచ్చటంలేదు... పైగా ఏదో వెగటు...!

'ఏమిటయ్యోయ్... మా నవ్య నిజంగానే మీ ఇంటికి కోడలుగా వచ్చేస్తుందను కుంటున్నావా, అంతలా వర్ణించేస్తున్నావూ...?' వ్యంగ్యంగా అనేసరికి 'కాదండీ...' అంటూ తల ఊపాను.

'అసంతృప్తి మనసులో ఉంటే... ఎంతటి అందమైన భవంతిలో ఉన్నా ఆనందం కలగదు. మనసుకు నచ్చచెప్పుకోగలిగితే, నచ్చని ఊరులో అయినా ఆనందంగా ఉండగలమని చెప్పటమే నా ఉద్దేశ్యం...! నేను ఇప్పటివరకూ మా ఇంటికి కోడలుగా తీసుకెళ్ళాలని పించేట టువంటి అమ్మాయి కనిపించనేలేదు.... ఒకవేళ నిజంగా మీ చెల్లెలుగారు నా చేయి అందుకోవాలనుకున్నా వీలుకాదులెండి... అందనంత ఎత్తులో ఉన్నాను మరి...!' అన్నాను.

ఒక క్షణం ఇద్దరూ దిమ్మెరపోయినట్లుగా చూశారు.

తరువాత తెప్పరిల్లి నవ్య అక్కలాగే వ్యంగ్యంగా నవ్వి 'ఏమనుకుంటున్నావు మా గురించి...? నీలాంటి వాళ్ళని వందమందిని కొనగలిగే స్థితిగతులు మావి...తెలుసా...?' అంది కోపంగా చూస్తూ.

'కావచ్చునుగానీ... నన్ను మాత్రం కొనలేరు...కొనగలిగేలాంటి ఆస్తిపాస్తులు మీ

దగ్గర లేవు లెండి...!' అన్నాను.

అలా మాటకి మాటా ఆ మాత్రం అయినా చెప్పకపోతే, నా అహమూ చల్లారదని పించింది!

నాలోనూ కొంత అహం వుందని అపుడే నాకు అర్థమైంది! వాళ్ళిద్దరి కవ్వింపు వల్లే ఆ అహమో, అభిమానమో బయటకు వచ్చి బుసకొట్టింది కాబోలు!

'ఆవులు, గేదెలు కాచుకునే వాడిని ఇంట్లోకి తెచ్చిపెట్టుకుని అందలం ఎక్కిస్తే... ఇలాగే ఉంటుంది...!' అని గొణుక్కుంటూ లోపలకు వెళ్ళిపోతున్న అక్కగారిని, నవ్య కూడా నావైపు చురచురచూస్తూనే వెంబడించింది!

ఆ రోజు జరిగిన సంభాషణల ఫలితం మరి రెండురోజులకే కనిపించింది!

నన్ను శిక్షిస్తున్నామని ఆ అక్కాచెల్లెళ్ళు భావించారేమోగానీ, నాకు మాత్రం శాపవిముక్తి కలిగినట్లే అనిపించింది! అమ్మగారు నరసింహంగారికి ఏం చెప్పి ఒప్పించారోగానీ, నన్ను ఊరుకి వెళ్ళి కొన్నాళ్ళుండి పొలాలూ, తోటలూ చూడమన్నారు. నేను ఆనందంగా అంగీక రించాను.

పశువుల కాపరినంటూ చిన్నబుచ్చి మాట్లాడగలిగే అవకాశం దక్కిందని వాళ్ళిద్దరూ సంతోషించారేమో తెలియదు గానీ... విలువ లేని చోటు నుండి విముక్తి కలగటం నాకు మాత్రం చాలా హాయిగా అనిపించింది!

నరసింహంగారికి దూరంగా వెళ్తున్నానని కొంచెంగా బాధగా ఉన్నా, మళ్ళీ మా ఊరిలోనే నివాసమనే ఊహతో మనసు కేరింతలు కొట్టింది!

నన్ను చూడగానే... పెట్టే బేడతో దిగాను కాబట్టి అమ్మ వింతగా ఆశ్చర్యపోతుందో అనుకుంటూ వచ్చాను... అయితే... అమ్మ 'వచ్చావా... అనుకుంటూనే ఉన్నాను...' అనేసరికి నేను ఖంగు తిన్నాను.

'నీకెలా తెలుసూ... నేను వస్తాననీ...?' అనడిగా.

'నరసింహంగారిని కలవటానికి మనవూరి వాళ్ళు వెళ్తున్నారని చెబితే.....నువ్వు కొన్నాళ్ళు మన ఊళ్ళో ఉంటే... పెళ్ళి ఆలోచన చేయాలనుకుంటున్నానని చెప్పమన్నాలే. ఆ విషయమే వారూ ఆలోచిస్తున్నారటా... అని మనవాళ్ళు తిరిగి వచ్చాక చెప్పార్లే... అందుకే, నువ్వు తొందరగానే వచ్చేస్తావని అనుకుంటున్నా...' అంది అమ్మ.

అప్పుడు అనుకున్నాను... వాళ్ళిద్దరూ నన్నిక్కడనుండి పంపించేయటానికి ఊళ్ళోని వ్యవసాయం అంటూ ఆలోచన చేస్తే.... నరసింహంగారూ అమ్మ మాటలతో ఇటువంటి ఆలోచనలోనే ఉన్నారు కాబట్టి... వెంటనే అంగీకరించేశారన్నమాట!

'అయితే... అమ్మా ఇది నీ ఆలోచనేనని ఇప్పటికి కదా అర్థమైంది...!' అనుకుంటూ అటుపక్కకి చూసేసరికి పళ్ళు, రెండు స్టీలు డబ్బాలు కనుపించాయి. మూతలు తీసిచూస్తే... ఏవో పిండివంటలు...!

అమ్మవైపు ప్రశ్నార్థకంగా చూశాను.

అమ్మ చిన్నగా నవ్వి 'మిత్తరికం అత్తావాళ్ళు నిన్న వస్తూ తెచ్చారు...' అంది.

'మిత్తరికం...! ఏమిటమ్మా... ఎపుడూ విన్లేదూ....' అనడిగా.

'నాకూ ఆ మాట కొత్తేలే...! మిత్తరికం... నేస్తరికం... అనేవి శ్రీకాకుళం జిల్లాల్లో ఉన్నాయట...! అంటే... ఎవరైనా మనకిష్టం అనిపిస్తే... పెళ్ళితో బంధుత్వం కలుపుకున్నట్లు ఒక వేడుకలా జరుపుకుని 'మిత్తరికం' అని అంటారట! మిత్తరికం అన్న, చెల్లి అంటూ అనుబంధాలు ఏర్పరుచుకుని కానుకలు ఇచ్చిపుచ్చుకోవటం చేస్తుంటారు. పెళ్ళిళ్ళులాంటి అన్ని శుభకార్యాలకు, ఇతర కార్యక్రమాలకు, బంధువుల్లాగే వచ్చిపోతూంటారట! మీ నాన్న ఉన్నప్పుడు... ఆ రోజుల్లో ఎవరో స్నేహితుని పెళ్ళిలో సుగుణమ్మ అనే ఆవిడ మీ నాన్నతో మాటలు కలిపి... మిత్తరకం తమ్ముడిగా చేసుకుంటానని చెప్పి... అక్కడ ఊళ్ళలో ఉన్న పాత సాంప్రదాయం గురించి వివరించిందట!

మీ నాన్న ఆవిడను అక్కగా భావించి చీర కొంటే, ఆమె మీ నాన్నకు బట్టలు పెట్టిందట. ఆ పెళ్ళి వేడుకలోనే... అంటే.... పనిలో పనిగా మిత్తరికం బంధుత్వమూ కలుపుకున్నారట! ఇదంతా ఇంటికి వచ్చాక నాకు చెప్పారు. వింతగా అనిపించింది. అటువంటి ఆచారం ఒకటి ఉన్నదనే ఈ ప్రాంతం వాళ్ళకి తెలియనే తెలియదు మరి!

ఆ సంవత్సరమే వాళ్ళు దుబాయ్ వెళ్ళిపోయారట. ఏ మూడు నాలుగేళ్ళకోసారి వాళ్ళవూరుకి వచ్చినా... ఇటు రాలేకపోయామని అంది. ఈ మధ్య ఇక మనదేశంలోనే స్థిరపడిపోదామని వచ్చేశారట. సుగుణమ్మ చెల్లెలు ఈ ఊళ్ళో నాలుగెకరాలు జామతోట అమ్మకానికి ఉందని ఎవరో చెబితే నిన్న ఆ తోటను చూసుకుని బేరం కుదుర్చుకోవాలని మన ఊరు వచ్చారన్నమాట! చెల్లెలుతో పాటూ సుగుణమ్మ కూడా ఎప్పుడో ఏర్పరుచుకున్న మిత్తరికం బంధుత్వాన్ని గుర్తుచేసుకుని మనింటకి వచ్చింది.

మీ నాన్న చనిపోయారనే వార్త ఈ మధ్యనే తెలిసిందట. నిన్న ఎంతలా వలవలా ఏడ్చిందో జ్ఞాపకం చేసుకుంటూ... ఏం చేయగలమంటూ నేనే ఓదార్చవలిసి వచ్చింది చివరకు! ఇంతకీ అసలు సంగతి ఏమిటంటే... సుగుణమ్మ చెల్లెలు కూతురు డిగ్రీ పూర్తిచేసింది. పెళ్ళి చేయాలనే ఆలోచనలో ఉన్నట్టున్నారు... ఈ వూళ్ళో వాళ్లెవరో నీ గురించి గొప్పగా చెప్పారేమో... నన్ను వివరాలన్నీ అడిగారు. వాళ్ళకున్న ఆస్తి వివరాలూ, అమ్మాయికి ఇవ్వదలుచుకున్నవీ వివరంగా చెప్పార్లే...! దాన్నిబట్టి నేనూహించాను. కుదిరితే మనతో సంబంధం కలుపుకోవాలనే ఆలోచనలో ఉన్నారని!

కొన్నాళ్ళు నువ్విక్కడే ఉంటే... వేరే సంబంధాలు అయినా చూసుకుంటే బావుంటుం దనిపించింది. ఇది తెలిసి... వీరేంద్రవాళ్ళు కూడా వాళ్ళింటికి వెళ్ళిపోతామంటున్నారు... నువ్వొచ్చాక చూద్దామని అన్నాను...! అంటూ అమ్మ ఇంకో మాటా చెప్పింది.

వాళ్ళు తోట గురించి మాట్లాడుకోవటానికి వస్తామని అన్నారు. అంటే... నువ్వు ఈ రోజు వస్తావని అనుకుంటున్నానని వాళ్ళకి చెప్పాలే. నీ ఉద్దేశ్యం ప్రకారం అయితే, వాళ్ళీరోజు నిన్ను చూసుకుని అప్పుడు సంబంధం గురించి మాట్లాడుతారని...!'

అపుడు అమ్మతో శుభగారితో, వాళ్ళ చెల్లెలు నవ్యతో జరిగిన సంభాషణ అంతా క్లుప్తంగా చెప్పుకుపోయా.

అమ్మ నా వైపు విస్మయంగా చూసింది. 'నిన్ను కొనగల తాహతు లేదన్నట్లు... అంత ధీమాగా ఎలా మాట్లాడగలిగావురా... ఈ రోజు వీళ్ళు వచ్చినప్పుడు అలా తలతిక్కగా మాట్లాడకు...!' అంటూ హెచ్చరించింది. తర్వాత తనలో తాను అనుకుంటున్నట్లుగా 'ఆస్తిపాస్తుల సంగతిదేముందిగానీ, అమ్మాయి ఎలా ఉంటుందో... మనలో కలిసిపోయే స్వభావమోకాదో.. అదికదా ముఖ్యం...!' మెల్లగా అనుకుంది.

'వాళ్ళు వచ్చినప్పుడు... ఆ అమ్మాయినీ వెంటబెట్టుకుని వచ్చివుంటే... ఈ విషయాలు నీకూ తెలిసిపోయేవిగా...' అనగానే అమ్మ 'తోటకొనటానికే చూసుకోవటం... బేరం కుదుర్చుకోవటం... అంటూ ఇన్నిసార్లు తిరగాల్సివస్తోంది...! అలాంటిది... పెళ్ళంటే మాటలా... ఎన్నిసార్లు కలవాలో... ఎన్నెన్ని విషయాలు మాట్లాడుకోవాలో...!' అంటూ నిట్టూర్చింది.

'అంటే... ఏమిటమ్మా నీ ఉద్దేశ్యం...నా పెళ్ళిలోనూ బేరసారాలు ఉంటాయం టున్నావా...?' నవ్వుతూ నేనూ అన్నా. ఇద్దరం లోపలి గదిలో నుండి ముందు గదిలోకి వచ్చాం...!

అక్కడ ఎవరో కొత్త అమ్మాయి చివరగా ఉన్న కుర్చీలో కూర్చుని ఉంది. మేం రాగానే చటుక్కున లేచి నిలబడింది. బిత్తరపోయి చూస్తున్న మాతో వివరం చెప్పింది.

మా సుగుణ పెద్దమ్మా, అమ్మ వాళ్ళు వెనక బస్సులో వస్తోంటే... నేనే... ఇక్కడ... కొంచెం పని ఉండి ముందుగా బయలుదేరి వచ్చాను. మీ ఇంటికే వస్తామని చెప్పి.... నా పని చూసుకున్నాక... ఆనవాలు చెప్పి... నన్నూ ఇక్కడే ఉండమని చెప్పారు...!'

అప్పటికి విషయం అర్థమైంది.

అమ్మ కొంచెం కంగారు పడుతూ 'నువ్వు వచ్చి ఎంత సేపయిందమ్మా...?' అనడిగింది. 'ఇప్పుడేనండి... నేనిలా వచ్చి కూర్చున్నానూ... మీరు వచ్చారు.. మమ్మల్ని పిలవకపోవటం తప్పయిపోయింది...' అంది కొంచెం నసుగుతూ.

అమ్మ చిరునవ్వుతో జవాబు చెప్పింది 'ఏం ఫరవాలేదమ్మా... నిన్ను ఎక్కువ సేపు కూర్చోబెట్టేశానేమో అనుకుంటున్నానంతే...!'

'అంటే... తలుపు తట్టబోతే, తెరుచుకుంది. లోపల ఎవరైనా ఉన్నారో లేదోనని సందేహం వచ్చి లోపలకు వచ్చేశాను... మాటలేవో వినిపిస్తోంటే...వస్తారు కదాని కూర్చున్నానో, లేదో మీరు వచ్చేశారు..! లోపలకు వచ్చి కూర్చున్నానని తప్పుగా అనుకోకండీ...!'

ఆ అమ్మాయి ఆమాత్రం దానికే అంతగా సంజాయిషీ ఇస్తుంటే... నాక్కొంచెం ఆశ్చర్యమే అనిపించింది!

పరిశీలనగా చూశాను. చూడగానే ఆకట్టుకునే రూపమే...!

అమ్మ ఆ అమ్మాయి పక్కనే కూర్చుని ఆదరంగా చూస్తూ మాటలు కలుపుతూంటే, నేను వరండాలోకి వచ్చేసి కూర్చున్నాను. అంతలోనే బిలబిలమంటూ నలుగురు వచ్చారు. వాళ్ళెవరో ఊహించాను. ఆడవాళ్ళు ఒక క్షణం నన్ను పరిశీలించి చూసి లోపలకు వెళ్ళిపోయారు.

మగవాళ్ళుమాత్రం... నా పక్కనే కూర్చుని ఏవేవో ప్రశ్నలు అడుగుతూంటే... సమాధానాలు చెబుతూ కబుర్లు కొనసాగించాను.

ఇంతలో అమ్మ పిలిస్తే... లోపలకు వెళ్ళాను.

లోపల గదిలోకి వెళ్ళగానే అమ్మ గుసగుసగా 'వాళ్ళకి ఈ సంబంధం బాగా ఇష్టమని చెబుతున్నారు. వాళ్ళ పిల్లలకి చెందే ఆస్తివివరాలు వల్లెవేస్తోంటే... నేను వినిపించుకోకుండా పిల్లలిద్దరికీ ఇష్టమైతే... ఇలాంటి వివరాల ప్రసక్తి అనవసరం అని తేల్చేశాను...! మరి... మీ ఇద్దరూ మాట్లాడుకుని... తేల్చి చెప్పండి...!' అంది.

వెంటనే హడావుడిగా మళ్ళీ లోపలకు వెళ్ళపోయింది.

నా అభిప్రాయం ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో ఒక క్షణం అర్థం కాలేదు.

ఇంతలోనే అమ్మ కేక వినిపించింది. 'మాధవి అందరికీ కాఫీ కలుపుతానంటోంది... వంటగదిలో ఏవి ఎక్కడున్నాయో చూపించరా...' అంది.

మాధవి... ఆ అమ్మాయి పేరు అదే కాబోలు... అప్పుడు అర్థమైంది... అమ్మ లేక వాళ్ళోగానీ మేం మాట్లాడుకోవటానికి ఇలాంటి ఏర్పాటు చేశారేమో అనుకున్నాను.

వంటగదిలో ఏవేవి ఎక్కడున్నాయోనని చూస్తున్న మాధవితో 'మీ పేరు ఇప్పుడే తెలిసింది. నా పేరు అని అంటూండగానే 'నాకు తెలుసు... వేరే ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు..' అంది చిరునవ్వుతో.

ఇంతలో... చావడినుండి 'అంబా...'అనే అరుపు వినిపిస్తే... నేను 'సరే... అయితే, మా ఇంట్లోని ప్రదేశాలన్నింటినీ పరిచయం చేస్తాను...కాఫీ కలిపే ముందు... పాలు ఎక్కడ నుండి వస్తాయో అక్కడకు తీసుకువెళ్తాను... రండి...! అంటూ పెరటివైపు అడుగులు వేశాను. కొంచెం అయోమయంగా చూస్తూనే... నన్ను అనుసరించటం గమనించాను.

చావిట్లో ఓ నాలుగు ఆవులు మాత్రమే ఉన్నాయి. మిగతావి ఇంకా రావాల్సి ఉంద నుకుంటా... వీరేంద్రతో వస్తాయేమో...!

నేను వాటిని ఆప్యాయంగా నిమురుతూ 'నేను చిన్నప్పటినుండీ... వీటి మధ్యే పెరిగాను. ఇవే మా సంపద...! ఈ విషయం చెప్పుకోవటానికి చిన్నతనం లేదు. మరి...మరి... మీరు బాగా ఆలోచించుకోండి... ఇవీ మా కుటుంబ సభ్యులేనని ఇష్టంగా చెప్పుకుంటాం... అవసరమైనప్పుడు మీరూ ఈ మూగజీవుల పట్ల ఆదరం చూపించగలరా... గోవుల కాపరిని మీ జీవితంలోకి ఆహ్వానించగలరా...?' అనడిగాను. పరోక్షంగా తనకి ఈ పెళ్ళి ఇష్టమేనా అని నాకు తోచిన పద్ధతిలో అడిగానలా...!

బహుశా... ఆ రోజు శుభగారు...నన్ను..పశువుల్ని కాచేవాడినంటూ తేలికగా మాట్లాడి చులకన చేసినందువల్లే...తన అభిప్రాయం ఇలా తెలుసుకోవాలని అనిపించి ఉంటుంది! మొదటిసారి నన్ను పలుకరించినప్పుడు కూడా 'ఆవుల రాఘవ కొడుకువా...' అనటంకూడా నేను మర్చిపోలేదు.

ఆ మాధవి ఒక క్షణం నావైపు చురుగ్గా చూసి... నిదానంగా జవాబు చెప్పింది.

'పశుపోషణ, మొక్కల సంరక్షణ... రెండూ నాకు ఇష్టమైన వ్యాపకాలే..! అంటే...

మీకు ఆ విషయంగా సందేహం అక్కర్లేదు. చదువుకున్న అమ్మాయి ఇలాంటి పనులు చేయగలదా, చేస్తుందా... అని మీకు సందేహం రావటం సహజమే..! చాలామంది ఇలా మాట్లాడటం నేనూ విన్నాను! పండించే రైతులన్నా, పశువుల్ని పెంచే వాళ్ళన్నా నాకు చాలా గౌరవం. ఉద్యోగాలు చేసే వాళ్ళందరికీ కూడా తిండీ... తిప్పలు... పాలు ఇవన్నీ కావల్సిందేగా! అలాంటప్పుడు ఆ వృత్తుల్ని తేలికగా చూడలేం కదా... నాక్కూడా పశువుల పాకని శుభ్రం చేయటానికీ, వాటిని కడగటానికీ కూడా ఏం అభ్యంతరం ఉండదు!

మనకు ఈ పనులన్నీ వచ్చివుంటేనేగా, ఎవరికైనా చెప్పి చేయించుకోగలం... సరిగ్గా చేస్తున్నారా లేదా అన్నది కూడా పసిగట్టగలం...!'

మాధవి నావైపు కొంచెం ఓరగా చూసి 'చెప్పండి... ఇప్పుడు... మీకేం అభ్యంతరం లేదుగా...?'అంది.

నాకు ఒళ్ళు ఝల్లుమంది!

వెంటనే ఏం జవాబు చెప్పాలో తెలియక 'మనవాళ్ళు కాఫీల కోసం ఎదురుచూస్తుంటారు. మనం మళ్ళీ కలిసి మాట్లాడుకుందాం...!' అనేశాను.

నా వెనుకే వస్తూ మాధవి 'అవునవును... పెళ్ళంటే మాటలా... ఎన్నిసార్లు కలవాలో, ఎన్నెన్ని విషయాలు మాట్లాడుకోవాలో...!' అనేసరికి నేను ఆగిపోయి తనవైపు ఆశ్చర్యంగా చూశాను.

తనూ ఆగిపోయి ఏమిటన్నట్లు చూపులతోనే అడిగింది.

పెదవులపైకి చిన్న చిరునవ్వు వచ్చింది.

'అప్పుడే వచ్చానని అమ్మతో అన్నారుగానీ అది నిజంకాదు కదూ...?' అన్నాను.

అదే చిరునవ్వుతో 'ఎందుకలాంటి అనుమానం వచ్చింది? ఈ మాట అప్పుడే చెప్పానుగా!' అంది.

'నాకు తెలిసింది... మీరు మా మాటలు విన్నారని...! లేకపోతే, అమ్మమాటల్ని యథాతథంగా ఎలా చెప్పగలరు....? అది సరేగానీ, ఇంకేం విన్నారో అదీ చెప్పండి...' అన్నా.

'సరిగ్గా చెప్పాలంటే... ఎవరో మిమ్మల్ని ఏదో అంటే... మీరు అందరికీ అందేవాడిని కాదని జవాబు చెప్పినట్లున్నారు... అంతేనా...? నాకు సరిగా వినిపించలేదు. నేను అప్పుడే వచ్చి కూర్చున్నా...!'

'మరి ఎందుకలా... చెప్పటం... నాలుగు నిముషాలయిందని చెప్పొచ్చుగా....'

'అబద్ధం చెప్పాలని కాదుగానీ... మీ అమ్మగారు మీ మాటలు విన్నానేమోనని కొంచెం కంగారుపడుతున్నట్లుగా అడిగేసరికి... నేనలా చెప్పేశాను. చూశారా.... నేనలా చెప్పగానే, మీ అమ్మగారు చాలా రిలీఫ్‌గా ఫీలయ్యారనిపించింది...! అందుకేనేమో నేనూ అలా చెప్పా ననుకున్నా...

నాకు కొంచెం ఆశ్చర్యంగా అనిపించింది.

అమ్మ కంగారు పడిందని... అలా చెప్పటం... అంటే... అమ్మ ఆలోచనకు అంత

విలువ ఇవ్వడం నాకూ నచ్చింది!

తన వైపు ఇష్టంగా చూశాను. అమ్మకూ అదే మాట చెప్పెయ్యాలని మనసులోనే నిర్ణయించుకున్నాను. ఇక తన ఇష్టం కూడా తెలుసుకోగలిగాలి... ఎలా... ఆ ఆలోచనతోనే లోపలకు వచ్చా.

చకచకా నేను అందించినవన్నీ తీసుకుని కాఫీ పెట్టేసింది మాధవి.

కప్పుల్లో సర్దాను. తను తీసుకెళ్ళబోతూంటే... నేనే తీసుకువెళ్ళి ఇస్తానని ఆ ప్లేటు అందుకున్నాను. 'మీరెందుకూ... వద్దు...' అంటూ... 'అందరూ మనవాళ్ళేగా... ఏం ఫర్వాలేదు..పైగా మా అమ్మాయికి ఈ అబ్బాయి అన్నింటిలోనూ చేదోడు వాదోడుగా ఉంటాడని అర్థమై... సంతోషిస్తారు కూడా!' అన్నాను చిరునవ్వుతో చూస్తూ.

తనూ చిన్నగా నవ్వింది.

'మీ అమ్మగారికి మాత్రం కోపం వస్తుందేమో... సాధారణంగా అంటూ ఉంటారు.. అప్పుడే కొంగుకు కట్టేసుకుని ఆడించేస్తోందీ...!' అని వెంటనే సిగ్గుతో కాబోలు కళ్ళు క్రిందకు వాల్చేసింది.

కాఫీ కప్పులతో నేను బయటకు రాగానే 'అదేంటి బాబూ... నువ్వు తెచ్చావూ...?' అంటూ వాళ్ళందరూ కంగారు పడుతూంటే...

అమ్మ మాత్రం చిరునవ్వుతో

'నేనూ మీతో కూర్చుని ఉండిపోతే...మరి...మర్యాద చేసే బాధ్యత వాడిదేగా!' అంది.

వాళ్ళందరూ తాగటం అయ్యాక... మాధవే ఖాళీ కప్పుల్ని వంటగదిలోకి తీసుకు వచ్చింది. నేను చనువుగా, సరదాగా అన్నాను 'చూశావుగా, అమ్మది... తప్పుల్ని ఎంచే తత్త్వం కాదు...' అని నేను మాట పూర్తిచేయకముందే, అందుకుని 'సర్దుబాటు మనస్తత్వం...!' అని ఒక క్షణం తర్వాత మళ్ళీ 'అర్థమైంది... నాకూ...!' అంటూ నవ్వింది.

'మా వాళ్ళు... ఉద్యోగం చేయటం అదీ... వద్దంటే, ఆ వూళ్ళో ఉండిపోవాల్సివస్తే... ఆలోచించు... ఉండగలవా' అనడిగారు.ఇప్పుడు నిశ్చింతగా, నిక్షేపంలా ఉండగలనని చెప్పగలను!' అంది నావైపు సరదాగా చూస్తూ..

నాకు చాలా ఆనందంగా అనిపించింది.!

'మొదట్లో బాగానే ఉండొచ్చు... తర్వాతర్వాత... ఏమో ఎలా ఉంటుందో చెప్పలేంగా, ఏమైనా మీవాళ్ళు అన్నట్లుగా బాగా ఆలోచించే నిర్ణయించుకోవాల్సిన విషయం ఇది... తొందరపాటు మంచిది కాదనిపిస్తోంది...!' అన్నాను తన వైపు పరీక్షగా చూస్తూ.

'సరే... అయితే... మీరు బాగా ఆలోచించుకునే మీ నిర్ణయం చెప్పండి.... ఫరవాలేదు! నేను మాత్రం మా వాళ్ళకు ముందే చెప్పేసాను... ఉద్యోగం చేయటం, మానటం లాంటి విషయాలన్నీ ఎప్పటి పరిస్థితుల్ని బట్టి అప్పుడు ఆలోచించుకోవచ్చునని. నా దృష్టిలో అలాంటి వాటికి అంతగా ప్రాధాన్యం లేదు! సర్దుకుపోయే మనస్తత్వమే నాదీను..!' అంది.

నా ఇష్టమనేదంటూ ప్రత్యేకంగా ఏమీలేదు... అమ్మ గురించి అలా ఆరాగా ఆలోచించానని చెప్పినపుడే... నేను తనకి దాసోహమైపోయానని... మనసులో అనుకున్నాను...!

నా మనసులోని మాటను పసిగట్టినట్లుగా మాధవి చిరునవ్వుతో చూసింది.

'అవునూ...నీకు ఇష్టమేనని ఎప్పుడు చెప్పావు....' ఇప్పుడేగా మీరు వచ్చారు... చూడకముందే ఎలా... ఉద్యోగం చేయటం లాంటివైతే, వివరాలు చెప్పినపుడు... నీ అభిప్రాయం చెప్పి ఉంటావు. చూసి, మాట్లాడాక కదా, ఇష్టమో, అయిష్టమో చెప్పాల్సింది...?' నా సందేహం బయటపెట్టాను.

'నేను వాళ్ళు రాకముందే... ఒంటరిగా ఎందుకు వచ్చానని అనుకున్నారూ...? ఈ ఊళ్ళో నాకున్న పని అంటే... ఇదే...!'

'అంటే... ముందుగా ఒంటరిగా వచ్చింది....నన్నూ, అమ్మనూ, ఈ ఊరునూ, మా ఇల్లూవాకిలీ వగైరాలన్నీ చూసుకోవటానికన్నమాట! ఇప్పుడు అర్థమైంది! మరి... మరి... మీ వాళ్ళు రాగానే నీకు ఇష్టమేనని ఎలా ఎప్పుడు చెప్పావు...?' ఆసక్తిగా అడిగాను.

మళ్ళీ చిన్నగా నవ్వింది.

'మాటలద్వారానే చెప్పాలా...? కంటి చూపు, చిరునవ్వు... ఇవీ మన మనసును తెలియజేస్తాయిగా. మీకు ఇష్టమేనని మీరు ప్రత్యేకంగా చెప్పకుండానే నేనెలా గ్రహించగలిగానని అనుకున్నారు..?' తమాషాగా ప్రశ్నించింది!

నేను హాయిగా నవ్వాను. 'నీకో విషయం తెలుసా...? మా నాన్న పెళ్ళి జరిగినపుడు... పెళ్ళి చూపుల్లో మా అమ్మ మాట్లాడిన పద్ధతికి విస్తుబోయిన మావూరివాళ్ళు వింతగా ఆ కబుర్లు చాలా రోజులే చెప్పుకున్నారట! ఇప్పటికి మన పద్ధతీ కొత్తగా అనిపించి... మళ్ళీ మావూరి వాళ్ళు... చాలా రోజులు ఆశ్చర్యపోతూ మాట్లాడుకుంటారనిపిస్తోంది! మరి... పశువుల పాకలో పెళ్ళి చూపులు... అమ్మాయే అబ్బాయి ఇంటికి రావటం... విచిత్రమేగా...!' నా మాటలకు మాధవీ హాయిగా నవ్వింది.

ముందు గదిలో కూర్చున్న వాళ్ళతో పాటూ, నా అంగీకారమూ మా అమ్మకీ తెలిసినట్లుంది, మా పొరుగునే ఉండే బంధువులు నలుగురిని రమ్మని కబురు పెట్టింది. అందరూ కలిసి అన్నీ నిర్ణయించుకున్నారు.

ఈ వార్త నరసింహంగారికీ చెబుతానని నేను బయలుదేరి వెళ్ళాను.

ఊరునుండి నేను పట్టుకువచ్చిన పళ్ళు, కూరగాయలను వంటమనిషి లోపల పెట్టిస్తుండగా నేను హాలుగదిలోకి వచ్చాను.

అమ్మగారు, నరసింహంగారు ఏదో సీరియస్‌గా మాట్లాడుకుంటున్నట్లుగా అనిపించి ఆ సమయంలో లోపలికి వెళ్ళాలో, మానాలో తెలియనట్లుగా సందేహించి, ఒక క్షణంలోనే వెనుదిరగబోతోంటే... శుభగారు 'రావయ్యా... రా... నీ గురించే మా వాదన...' అని పిలిచారు. నేను ఆశ్చర్యంగా చూస్తూనే లోపలకు అడుగు వేసాను.

నరసింహంగారు 'ఒకసారి వచ్చి వెళ్ళమని నేనే కబురు చేద్దామని అనుకుంటూండగా నా మనసులోని మాట తెలిసినట్లుగా నువ్వే వచ్చావు. నువ్వు లేకపోతే, నా కుడి చెయ్యి పడిపోయి... లేవనెత్తలేకుండా అయిపోయినట్లుగా ఉంది! అప్పుడప్పుడూ అయినా వచ్చి రెండు మూడు రోజులుండి వెళ్తూండు. ఇపుడే కాదు, పెళ్ళీ... అన్నీ పూర్తయి స్థిమితపడ్డాకనే...!'

అన్నారు.

పెళ్ళిమాట చెప్పటానికే నేను వచ్చాను. ఆ మాట ముందే తెలిసిపోయిందా...? ఎలా... ? ఆశ్చర్యంగా అనిపించింది!

నరసింహంగారు చిరునవ్వుతో చూశారు. 'వాళ్ళు ఇక్కడికీ వచ్చి నీ వివరాలడిగి తెలుసుకున్నారు. నిశ్చయమని నిర్ణయించుకోగానే నాకూ తెలియజేశార్లే...!'

నేను ప్రత్యేకించి చెప్పనవసరంలేదని అర్థమైంది!

'అదిసరేగానీ, నీ గురించే మా వాదన అన్నాంగా, దేని గురించి అనుకుంటున్నావ్...? వాళ్ళు కొన్న జామ తోటకి దగ్గర్లోనే నాలుగెకరాల మామిడితోట అమ్మకానికి వచ్చిందంటే... అది నేను నీ కోసమని కొన్నాను...!'

నాకు ఆశ్చర్యమే కాదు, కొంచెం కోపం కూడా వచ్చింది.

'అదేమిటండీ... అలా చేశారూ...?' అనేశాను. నాకు జీతం డబ్బులు ఇచ్చి దూరం పెట్టినట్లు దుఃఖం కూడా వచ్చింది.

శుభ అమ్మగారు కూడా నిట్టూర్చారు... 'అదేనయ్యా... నేనూ అంటున్నది. ఇన్నాళ్ళూ శిష్యుడిలా వెంటవున్నవాడికి... గుమస్తాకి జీతం లెక్కకట్టి ఇచ్చినట్లుగా ఇదేమిటీ అని! నేనొకొసారి గుమస్తా అనే మాట ఉపయోగించినందుకు కోపం తెచ్చుకుని కొడుకులాంటివాడు, అంతకన్నా ఎక్కువే అన్నారా ఈ పెద్దమనిషీ...!'

నరసింహంగారు వెంటనే కల్పించుకున్నారు.

'గుమాస్తాగా భావించి జీతం ఇస్తున్నట్లుగా ఎందుకనుకోవాలీ...? ఇన్నేళ్ళు ఖాళీగా ఉన్నట్లు కాకుండా, పనిచేసి సంపాదిస్తున్న వాడి డబ్బుతో బాగోగులు చూస్తున్న పెద్దమనిషిగా కొన్నానని ఎందుకనుకోకూడదూ...?'

"ఏమో..మీరన్న మాటనే నేను గుర్తుచేశాను. మీకు వీడు ఇంకో కొడుకులాంటి పెంపుడు కొడుకనుకున్నా. మరి...ఇప్పుడు జీతం ఇవ్వటంలా ఈ పనెందుకని అడిగా. అంతేకదా ?"

కొంచెం వ్యంగ్యంగా అన్న ఆ మాటలకి నరసింహంగారికి కోపం వచ్చిందేమో, గొంతు పెంచారు. 'పదేపదే జీతం అంటున్నావు... అది నేను ఇస్తున్నది కాదు, తన కష్టార్జితం...! స్పీచ్‌లు రాసి పెట్టటం దగ్గర్నుండీ... ఎన్ని రకాలుగా ఎంత సేవ చేశాడో నీకు తెలియదా...? కొడుకులంటే... తీసుకునేది ఎక్కువగా, తిరిగి ఇవ్వగలిగేది తక్కువగా ఉంటుంది...! అందుకే కొడుకు కంటే ఎక్కువని అంటున్నాను. ఇది నీకెందుకు అర్థంకాదూ...? 'మనవాళ్ళు' అంటూ నువ్వు చేర్చిన మీ వాళ్ళు.... మన దగ్గర్నుండి జీతాల రూపంలోనే కాకుండా, కానుకలనో, ఇంకోటనో ఎంతెంత సంపాదించుకుంటున్నారో నీకు మాత్రం తెలియదా...?'

అటువంటి వాదన నా పేరు మీదుగా జరగటం...నాకు చాలా బాధని కలిగించింది!

'సార్... మీరు నాకు కొడుకులాంటి స్థానం ఇస్తున్నాననటమే..నాకు గొప్ప కిరీటం లాంటిది! ఇలా తోటలు లాంటి కానుకలేమీ అవసరం లేదు... ఈ మాట అంటున్నందుకు మన్నించండీ...! అన్నా.

'విన్నావా' అన్నట్లుగా కాబోలు నరసింహంగారు ఆమె వైపు చూశారు.

ఆమెకూడా వ్యంగ్యంగా... చిరునవ్వుతో 'అవును... కొడుక్కి ఇచ్చినట్లు ఆస్తిలో వాటా ఇవ్వండి...!' అన్నారు.

ఆ మాట నన్ను ఇంకా ఇబ్బంది పెట్టింది.

నరసింహంగారితో 'కొడుకుగా భావిస్తే... ఆస్తిపాస్తుల్లో కాదండీ, బాధ్యతల్లో మాత్రమే భాగం ఇవ్వండి.. అదొక గౌరవంగా ఆనందిస్తాను...!' అన్నాను.

'ఎవరు... ఏమనుకున్నాసరే... నేను చేయాల్సింది చేశాను! నీ పెళ్ళికి నేనిచ్చే కానుక అనుకుంటావో, నీ కష్టార్జితమే అనుకుంటావో నీ ఇష్టం...! పెద్దవాడిగా నేనిస్తున్నది కాదనే హక్కు మాత్రం నీకు లేదు...!' ఖచ్చితమన్నట్లుగా చెప్పేసారు.

ఆమెకు వ్యతిరేకంగా నరసింహంగారు గర్జించినట్లుగా అలా మాట్లాడటం... మొదటి సారి విన్నాను!

***